విషజ్వరాలతో.. విలవిల


వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి రమేష్‌బాబు

- పెరుగుతున్న వైరల్ ఫీవర్స్
- గాడి తప్పిన పారిశుధ్య నిర్వహణ
- ప్రజలపై దోమల దాడి
- అన్ని ప్రాంతాల్లో భారీగా జ్వరపీడితులు
- ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న రోగులు


ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ వద్ద బారులు


మందుల గది వద్ద జ్వర బాధితులు

పెదగంట్యాడ: విజృంభిస్తున్న జ్వరాలతో మండల ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఏ చిన్న వైద్యశాల చూసినా రోగులతో కిటకిటలాడుతోంది. మరో వైపు పారిశుధ్య నిర్వహణ గాడి తప్పడంతో దోమల దండ యాత్ర పెరిగింది. దీంతో విష జ్వరాలు మరింత వణికిస్తున్నాయి. ఇటు రక్తపరీక్షలు, అటు వైద్య చికిత్స ఖర్చుతో పేద, మధ్య తరగతి వారికి కష్టాలు రెట్టింపు అవుతున్నాయి.

ప్రతి ఇంట్లో జ్వరపీడితులు

మండలంలోని పెదగంట్యాడ, సిద్ధేశ్వరం, గిరిజాకాలనీ, గంగవరం, దేవాడ, నమ్మిదొడ్డిలో 6 ప్రాథమిక వైద్య కేంద్రాలు ఉన్నాయి. ఆయా ఆస్పత్రులకు జ్వరపీడుతుల తాకిడి పెరుగుతోంది.ప్రతి ఇంట్లో వారు దగ్గు, జలుబు, జ్వరంతో పాటు ఒళ్లనొప్పులు, తలనొప్పి, విరేచనాలు, వాంతులు వంటి లక్షణాలతో చికిత్స కోసం వస్తున్నారు.

ఫీవర్ సర్వే ఏదీ?

గత ప్రభుత్వంలో ఇలాంటి సీజన్‌లో ఫీవర్ సర్వే ఇంటింటా నిర్వహించేవారు. జ్వర లక్షణాలున్న వారిని గుర్తించి ఇంటి వద్దే మందులు ఇచ్చి బాగు చేసేవారు.అవసరమైనవారిని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి దగ్గరుండి చికిత్స అందించేవారు. ప్రస్తుతం ఇలాంటి కార్యక్రమాలు ఏవీ చేయడం లేదు. మొక్కుబడిగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. కాలువల్లో మురుగు తీసి రోజులు తరబడి వదిలేయడంతో దుర్వాసన కొడుతుంది.దీనిపైనే ఈగలు, దోమలు వాలి అవి బయట విక్రయిస్తున్న ఆహార పదార్థాలపై వాలుతున్నాయి. వాటిని తిన్న ప్రజలు అనారోగ్యానికి గురువుతున్నారు..

కానరాని వైద్య శిబిరాలు

ప్రజలను జ్వరాలు పట్టి పీడిస్తున్నప్పటికీ ఎక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

రోజూ 20 నుంచి 40 జ్వరాల కేసులు

మండలంలో ఉన్న ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో రోజుకు ఓపీ 50 నుంచి 80 వరకూ చూస్తున్నారు. అందులో 20 నుంచి 40 జ్వరాల కేసులే నమోదువుతున్నాయని వైదులు తెలుపుతున్నారు.

దీంతో రోగులు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి వైద్యం పొందాల్సి వస్తోంది. అన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తత అవసరం



సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగాఉండాలి. కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.నిత్యం చేతులను శుభ్రం చేసుకోవాలి. నిల్వ ఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.దోమలు కుట్టకుండా చూసుకోవాలి. జ్వర లక్షణాలు కనిపించగానే ప్రజలు వైద్యులను సంప్రదించాలి.

డాక్టర్ రమేష్‌బాబు,
వైద్యాధికారి, పీహెచ్‌సీ పెదగంట్యాడ.

వైద్య పరీక్షలు చేస్తున్నాం



ఆస్పత్రికి వస్తున్న రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నాం. వైరల్ ఫీవర్స్ ఎక్కువగా ఉన్నాయి.కాచి చల్లార్చిన నీటిని మత్రమే తీసుకోవాలి. వేడిగా ఉన్న ఆహార పదార్థాలు తినాలి. జ్వర లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించాలి.ఇంటి వద్దే ఉంటూ తగ్గుతుందని అనుకుంటే ఇబ్బంది పడతారు.

డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా,
వైద్యాధికారి

వైద్య శిబిరాలు నిర్వహించాలి



పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్యం చేరువ చేయాలి. అవసరమైన ప్రాంతాల్లో గత ప్రభుత్వం లా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. అన్ని రోగాలకు మందులు అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం అన్ని రకాల సేవలు అందక పోవడంతో ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. రోగులకు ఉచితంగా మందులు అందజేసి ఆదుకోవాలి.

ఎస్. మణి, ఇస్లాంపేట

మేల్కోకుంటే ముప్పే!


రైల్వే క్రాసింగ్ వంతెన రిటైనింగ్ వాల్‌లో ప్రమాదకరంగా పెరుగుతున్న రావిచెట్టు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ క్రాసింగ్ వంతెన రిటైనింగ్ వాల్‌లో రావి చెట్టు పెరగడంతో గోడలు బీటలు వారి ప్రమాదకరంగా మారింది. క్రాసింగ్ వద్ద వై ఆకారంలో వంతెన నిర్మించారు. ఒక మార్గం దువ్వాడ వీఎస్ఈజెడ్ వైపు ల్యాండింగ్ అవుతుండగా, మరో ల్యాండింగ్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు ఉంది. నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం వైపు ల్యాండింగ్ అయ్యే వంతెన రిటైనింగ్ వాల్‌లో రావి చెట్టు పెరుగుతూ వస్తుంది. సీసీ కాంక్రీట్ తక్కువగా ఉన్నచోట బీటలు వారి ప్రమాదకరంగా మారింది. అయితే వీటిని తొలగించాల్సిన అధికారులు చోద్యం చేస్తుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రిటైనింగ్ వాల్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వరద బాధితులకు దుప్పట్లు, మందుల పంపిణీ

అక్కిరెడ్డిపాలెం: ముంపునకు గురైన విజయవాడలోని రాజీవ్‌నగర్, సింగ్‌నగర్, ప్రశాంత్‌నగర్, ప్రాంతాల్లో ప్రజలకు ఎస్‌బీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ ఆర్థిక సహాయంతో దుప్పట్లు, బిస్కెట్లు, మందులు అందజేశారు. కనీస అవసరాలకు మంచినీటి, తాగునీటి బాటిళ్లు, ఆహారం అందజేస్తున్నట్లు ప్రాజెక్ట్స్ ప్రతినిధులు తెలిపారు.

క్లుప్తంగా

అప్పికొండ తీరంలో జెడ్సీ పర్యటన


అప్పికొండ తీరంలో పర్యటిస్తున్న జెడ్సీ సన్యాసినాయుడు

పెదగంట్యాడ: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు కోరారు. భారీ వర్షాల కారణంగా జలమయమైన జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని నమ్మిదొడ్డితో పాటు అప్పికొండ సముద్ర తీరంలో సోమవారం ఆయన పర్యటించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉందని, ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉందని మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని కోరారు.

పేద కుటుంబాలకు భోజన ఏర్పాట్లు


భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న తహసీల్దార్ శ్రీవల్లి తదితరులు

గాజువాక: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పనులు కోల్పోయి ఇబ్బంది పడుతున్న శ్రీరామ్‌నగర్ కొండవాలు ప్రాంతంలోని పేద కుటుంబాలకు స్థానిక సీఎల్‌సీ మినిస్ట్రీస్ యజమాని మహంతి సోమవారం 300 భోజనాలు సమకూర్చారు. వాటిని గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి, స్థానిక నాయకులు పప్పు రాజారావు, పప్పు శంకరరావు, కె.చంద్రరావు, రాయన్‌బాబు పంపిణీ చేశారు.

48 మంది రక్తదానం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న నిర్వాహకులు, యువకులు

అక్కిరెడ్డిపాలెం: అకాల మరణం పొందిన యువకుల జ్ఞాపకార్థం 69వ వార్డు తుంగ్లాంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. యువత, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో వందేభారత్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 48 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువతకు గ్రామ నాయకుడు కరణం ముత్యాల నాయుడు, శెట్టి నర్సింగరావు సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రసన్న గిరి నుంచి జారి పడిన బండ రాళ్లు


ప్రసన్న గిరిపై నుంచి జారి పడిన రాళ్లను పొక్లెయిన్ ద్వారా తొలగిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: తుపాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాలు జలమయ్యాయి. కొన్ని చోట్ల కొండచరియలు విరిగి పడుతున్నాయి. సోమవారం భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద నున్న ప్రసన్న వేంకటేశ్వరాలయం, ప్రసన్న గిరి కొండపై నుంచి భారీ బండరాళ్లు జారి కొండ పక్కనున్న సర్వీసు రోడ్డుపై పడ్డాయి. ఈ సమయంలో జనసంచారం లేకపోవడం ఎటువంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందుకున్న ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ గంట్రెడ్డి రామునాయుడు, మెంబర్ బొడ్డేటి అచ్చిలినాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పొక్లెయిన్ ద్వారా రాళ్లను తొలగించారు.

సెయిల్‌లో విలీనంతోనే ఉక్కు మనుగడ


ధర్నాలో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే మనుగడ సాధ్యమవుతుందని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సంఘాల నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్న డిమాండ్‌పై సోమవారం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నా చేశారు. కేంద్రం ఆంక్షలతో స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్ల వేలాది మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఉపాధి పొందారన్నారు. ఆయా వర్గాల అభివృద్ధిని ఓర్వలేక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు పూనుకుందని ఆరోపించారు. ఉత్పత్తిని గణనీయంగా తగ్గించడంతో పాటు ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇవ్వాలని కుట్ర చేస్తుందన్నారు. పీఎఫ్, ఎస్‌బీఎఫ్, త్రిఫ్ట్ సొసైటీలకు నిధులు జమ చేయకుండా ఆర్థికంగా దెబ్బతీస్తుందని మండిపడ్డారు. వెంటనే స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడపడంతో పాటు సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో డి. ఆదినారాయణ, జె. అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్. రావు, బి. అప్పారావు, ఎస్. శ్రీనివాసరావు, కాటం చంద్రరావు, యు.రామస్వామి, వరసాల శ్రీనివాసరావు, సురేష్‌బాబు, రామ్మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్తి సామర్థ్యంతో నడపాలి

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని స్టీల్ ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు మాట్లాడుతూ ముడి సరకులు లేకపోవడంతో స్టీల్‌ప్లాంట్ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జె. రామకృష్ణ, మసేను రావు, డి. అప్పారావు, డొక్క నర్సింగరావు, జె.వి. నరేష్‌కుమార్, కె. పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు కట్టబెట్టడానికి కేంద్రం కుట్ర

ఉక్కు పోరాట పరిరక్షణ సమితి నాయకుల ఆరోపణ


దీక్షలో పాల్గొన్న ఉక్కు కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏడాదికి 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా తక్కువ ధరకు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, ఎన్.రామారావు అన్నారు. అదే సెయిల్‌లో 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి రూ.లక్ష కోట్లు పెట్టుబడికి సిద్ధంగా ఉండడం దారుణమని వాపోయారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో సోమవారం 1307వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 2030 నాటికి 300 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేయాలని కేంద్రం నిర్ణయించినా.. నేటికీ ప్రభుత్వ, ప్రైవేటు కర్మాగారాలు కలిపి 150 మిలియన్ టన్నుల ఉక్కును కూడా ఉత్పత్తి చేయలేని స్థితి ఉందన్నారు. సెయిల్ 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేసిందని, పది మిలియన్ టన్నుల విస్తరణకు లక్ష కోట్లు వెచ్చిస్తున్నారని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి అవకాశం ఉందని, అయితే ముడి సరకులు అందివ్వకుండా సంక్షోభంలోకి నెట్టిందన్నారు. ఇటువంటి కర్మాగారాన్ని ప్రైవేటు సంస్థకు అమ్మాలని చూడడం అవివేకమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న రాస్తారోకోలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, వై.టి.దాస్, డీసీహెచ్. వెంకటేశ్వరరావు, కె.వెంకట్రావు, యు.వెంకటేశ్వర్లు, బి.అప్పారావు, పెదిరెడ్ల నీలకంఠం, ఆర్.వెంకటరావు, పూర్ణచంద్రరావు, ఎం.వి.రమణ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యపద్మ


కొండవాలు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్డీసీ సత్యపద్మ, తహసీల్దార్ రామారావు

పెదగంట్యాడ: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొండవాలు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యపద్మ సూచించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆయా ప్రాంతాలను పరిశీలించాలని ప్రభుత్వం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లను నియమించింది. ఇందులో భాగంగా సోమవారం ఆమె దయాల్‌నగర్, గంగవరం ప్రాంతాల్లో పెదగంట్యాడ తహసీల్దార్ ఎల్. రామారావు, సచివాలయ సిబ్బందితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్డీసీ సత్యపద్మ మాట్లాడుతూ భారీ వర్షల కారణంగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని, కొండవాలు ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. వర్షపునీరు సాఫీగా సాగిపోయేలా జీవీఎంసీ ప్రజారోగ్య విభాగ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడ్మిన్ నరేష్ ఉన్నారు.

కొండవాలు ప్రాంతాల పరిశీలన


శ్రీరామ్‌నగర్‌లో కూలిన గోడను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీవల్లి

గాజువాక: వర్షం కారణంగా దెబ్బ తిన్న కొండవాలు ప్రాంతాలను గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి సోమవారం పరిశీలించారు. 65వ వార్డు ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం ప్రాంతంలో కొండవాలు మార్గం, 71వ వార్డు శ్రీరామ్‌నగర్‌లోని నూకాలమ్మ గుడి ప్రాంతంలో ఒక రేకుల షెడ్డు ప్రహరీ వర్షానికి నానిపోయి పడిపోయిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆ ప్రాంతాలను పరిశీలించారు. శ్రీరామ్‌నగర్‌లో గోడ పడిపోవడంతో పాక్షికంగా దెబ్బ తిన్న ఇళ్లను కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

స్వచ్ఛమైన గాలి కోసం మొక్కలు నాటుదాం



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, సిబ్బంది

మహారాణిపేట: 'స్వచ్ఛమైన గాలిలో పెట్టుబడి పెట్టండి' అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెం టీబీ ఆస్పత్రి కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి ఆస్పత్రి వరకు జరిగింది. ఈ సందర్భంగా ధర్నా చేస్తున్న వారిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల వడగాల్పులు అధికమై వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. ఇలాంటి వాతావరణంలో వ్యవసాయం, ఆరోగ్యంపై పెను ప్రభావం తప్పదని హెచ్చరించారు. స్వచ్ఛమైన గాలిలో పెట్టుబడి పెట్టండని, దీని కోసం మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు డాక్టర్ జగదీశ్ ప్రసాద్, బాలాజీ, ఐ.మనోరమ, బి.మురళీకృష్ణ, గణాంక అధికారి మణికుమారి, మోహన్, ఇతర వైద్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


రామిరెడ్డి మాల కొండా రెడ్డి(ఫైల్)


ప్రమాదానికి కారణమైన లారీ

అక్కిరెడ్డిపాలెం: కూడలిలో రెడ్ సిగ్నల్ పడడంతో లారీ పక్కన స్కూటీపై ఇద్దరు వేచి ఉన్నారు. ఇంతలో గ్రీన్ సిగ్నల్ పడడంతో లారీ గాజువాక వైపు వెళ్లేందుకు క్రాస్ అవుతుండగా స్కూటీ కూడా లారీ పక్క నుంచి వెళ్తుండగా స్కూటీ లారీకి తగలడంతో అదుపుతప్పి పడిపోయింది. ఈ సమయంలో స్కూటీ వెనుక కూర్చొన్న వృద్ధుడు తూలి లారీ చక్రాల కింద పడి తీవ్ర గాయాలతో మృతి చెందగా ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి సురక్షితంగా బటయపడ్డాడు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక 100 అడుగుల రోడ్డు కూడలిలో సోమవారం రెడ్ సిగ్నల్ పడింది. ఈ సమయంలో స్కూటీపై జోగవానిపాలేనికి చెందిన రామిరెడ్డి మాల కొండా రెడ్డి (72)ని వెనుక కూర్చొండ బెట్టుకొని ఇంటికి పెయింటింగ్ పనులు చేసే వ్యక్తి స్కూటీ నడుపుతున్నారు. గ్రీన్ సిగ్నల్ పడడంతో లారీ పాతగాజువాక వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతోంది. లారీ పక్క నుంచి స్కూటీ కూడా మలుపు తిరుగుతుంది.ఈ క్రమంలో స్కూటీ లారీకి తగలడంతో వెనుక కూర్చొన్న మాల కొండా రెడ్డి తూలి లారీ చక్రాల కింద పడిపోగా తీవ్ర గాయాలతో మృతి చెందాడు. స్కూటీ డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని లారీను గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

జేసీఐ వారోత్సవాలు ప్రారంభం

దాబాగార్డెన్స్: జేసీఐ విశాఖ వ్యాలీ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. విశాఖ నగర ప్రజలకు మంచి ఆరోగ్యంతోపాటు వృత్తి నైపుణ్యతపై అవగాహన పెంచుతూ ప్రతి ఒక్కరిలో నాయకత్వ లక్షణాలు పెంచుతూ జేసీఐ చేపట్టే ఎన్నో సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 9 నుంచి 15 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ముందుగా నగరంలోని సీఎంఆర్ వద్ద జేసీఐ జెండా ఆవిష్కరించి వారోత్సవాలు ప్రారంభించారు. తొలిరోజు వృద్ధులతో సంతోషంగా గడిపారు. రెండో రోజు ఆరోగ్యపరమైన అవగాహన, మూడో రోజు పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు జేసీఐ విశాఖ వ్యాలీ అధ్యక్షురాలు ఇంద్రజ సంకు తెలిపారు. దేశవ్యాప్తంగా వారం రోజులపాటు జేసీఐ సంస్థల నేతృత్వంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. జేసీఐ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని వినతి


కేంద్ర మంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్, రాజు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ సోమవారం కేంద్ర భారీ, ఉక్కు పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర ఉక్కు సంయుక్త కార్యదర్శి డాక్టర్ సంజయ్ రాయ్‌ను కోరారు. సోమవారం ఆయన న్యూఢిల్లీలో కుమారస్వామిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. తక్షణ ఉపశమనం కోసం రూ. 10 వేల కోట్లు మంజూరు చేయాలని, స్టీల్‌ప్లాంట్ పూర్తి ఉత్పత్తి సాధించేందుకు అవసరమైన ముడి సరకు సమకూర్చాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకుంటామని హామీ ఇచ్చినట్టు రాజశేఖర్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో స్టీల్ ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధానకార్యదర్శి బి.ఎస్. రాజు ఉన్నారు.

మహారాజశ్రీ విశాఖపట్నం ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జివారి కోర్టులో
GWOP 11/2024
Between:
మేడిశెట్టి వరలక్ష్మి ... పిటీషనర్
And
Nil ... రెస్పాండెంట్
జనరల్ నోటీసు
ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా పై GWOP నందు పై తెలిపిన పిటీషనర్ పైన తెలిపిన కోర్టులో మైనరు అయిన మేడిశెట్టి దుర్గాప్రసాద్ వయసు 16 సం॥ చదువులు ఇతర అవసరముల నిమిత్తం ఆ మైనరుకు చెందిన ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని గార్డియన్‌గా తల్లి అయిన మేడిశెట్టి వరలక్ష్మి గారు అమ్మకం జరిపించుటకు పిటీషన్ వేసియున్నారు. కావున పై పిటీషన్ విషయమై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల పై కేసు వాయిదా తేది. 27-09-2024వ ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై వారి అభ్యంతరములను తెలియజేయవలెను. అట్లు తెలియజేయని పక్షంలో షెడ్యూల్ ఆస్తి అమ్మకం గూర్చి ఎవ్వరికి ఎట్టి అభ్యంతరములు, ఆక్షేపణలు లేవని భావించి శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానము చేయుదురు అని తెలియజేస్తున్నాము.
షెడ్యూలు
RCC Slabbed house measuring an extent 53.5 Sq. Yards Consisting of Ground & 1st Floors, Bearing D.No. 22-5-8, S.No. 42, Old assessment No. 5201001088001803, New assessment No.s 1086369289, Situated at Pedagantyada Village & Mandal, Visakhapatnam, with in the Limits of GVMC and bounded as follows.
East: Road, South: Road, West: Plot No. 656 (Part) North: Plot No. 639.
T. Prasanna, M.A., B.L.
Advocate, D.No. 18-4-17, Nadupuru, Pedagantyada, Visakhapatnam-44
Cell : 8886391888

పోలీసుల అదుపులో చైన్‌స్నాచర్లు..!

సీతమ్మధార: ఇద్దరు చైన్‌స్నాచర్లని నాలుగో పట్టణ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని విశ్వసనీయంగా తెలిసింది. సీతంపేట ప్రాంతానికి చెందిన వానపల్లి మంగ (55) పోర్టు స్టేడియం ఈస్ట్ గేటు ప్రాంతంలోని ఒక ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తున్నారు. ఈ నెల 7న ఉదయం 6.30 గంటల సమయంలో అక్కడికి వెళ్తుండగా మార్గ మధ్యలో గురుద్వారా వద్ద ఇద్దరు వ్యక్తులు వెనుక నుంచి ద్విచక్ర వాహనం మీద వచ్చి మెడలోని రెండున్నర తులాల బంగారు మంగళసూత్రం తెంపుకుని వెళ్లిపోయారు. వీరు ప్రస్తుతం ఢిల్లీలో వున్నట్టు గుర్తించారని సమాచారం. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేక పర్యవేక్షణలో ఆయన ఆదేశాల మేరకు ఆదివారం క్రైం పోలీసులు ఢిల్లీలో వీరిని అదుపులోకి తీసుకుని విశాఖ తీసుకొస్తున్నారని సమాచారం. చైన్‌స్నాచింగ్ కేసుని స్వల్ప వ్యవధిలోనే క్రైం పోలీసులు ఛేదించడం విశేషం.

పీజీ సెట్ రిపోర్టింగ్ తేదీ పొడిగించాలి


ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘం నాయకులు

విశాఖ సిటీ: ఏపీ పీజీసెట్–2024లో అడ్మిషన్లు పొందిన వారు రిపోర్టింగ్ చేసే తేదీని పొడిగించాలని బీసీ సంఘం నాయకులు సోమవారం ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావుకు వినతిపత్రం అందజేశారు. వర్షాల కారణంగా గ్రామాల నుంచి విద్యార్థులు రాలేని పరిస్థితి ఉందని, అందుకే తేదీ పొడిగింపుపై ఆలోచించాలని కోరారు. దీనిపై రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో బీసీ సంఘం నాయకులు పితాని ప్రసాద్, దంతేశ్వర్ పట్నాయక్ ఉన్నారు.